సాక్షి విశాఖపట్నం

శనివారం । 14 । జూన్ । 2025



అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు 8లో

ఘనంగా పునీత ఆంథోనీ చర్చి పండగ 8లో



న్యూస్‌రీల్

జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా పల్లంరాజు



దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా జీవీ పల్లంరాజు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని శుక్రవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. గత నెల 31న జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా విధులు నిర్వహించిన పి. శివప్రసాదరాజు పదవీ విరమణ పొందిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్‌గా ఉన్న పల్లంరాజుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌బాబు పూర్తి అదనపు బాధ్యతలతో జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా ఉత్తర్వులు జారీ చేశారు.

కొనసాగుతున్న ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాల్లో ఎస్జీటీ బదిలీల కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా, శుక్రవారం 801 నుంచి 1,600 వరకు సీరియల్ నంబర్లు ఉన్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. దాదాపు 800 మందికి ఈ ప్రక్రియ అర్ధరాత్రి దాటినా కొనసాగింది. రాత్రి 8:45 గంటల సమయానికి సీరియల్ నంబర్ 1358 వరకు కౌన్సెలింగ్ పూర్తయింది. మిగిలిన 242 మంది అభ్యర్థులకు అర్ధరాత్రి తర్వాత కూడా కౌన్సెలింగ్ కొనసాగింది. జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ శనివారం ఉదయం 1,601వ సీరియల్ నంబర్ నుంచి చివరి నంబర్ వరకు ఉన్న అభ్యర్థులందరికీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు ఉదయం 8:30 గంటలకే కౌన్సెలింగ్ హాల్‌కు చేరుకోవాలని ఆయన సూచించారు.

డీఎస్సీ పరీక్షకు 172 మంది గైర్హాజరు

ఆరిలోవ: జిల్లాలో డీఎస్సీ–2025 ద్వారా విద్యాశాఖ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ నియామక పరీక్షలు ఈ నెల 6వ తేదీ నుంచి కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 172 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం ఉదయం జరిగిన పరీక్షకు ఐదు కేంద్రాలలో మొత్తం 1,642 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అదేవిధంగా, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు ఎనిమిది కేంద్రాలలో 2,337 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాలను డీఈవో ఎస్. ప్రేమ్‌కుమార్ స్వయంగా సందర్శించారు. ఆయన ఒక కేంద్రాన్ని పరిశీలించగా, ఫ్లైయింగ్ స్క్వాడ్ నాలుగు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసింది. ఉదయం జరిగిన పరీక్షకు 109 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 63 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

ఇంజిన్ ఆఫ్.. మీటర్ ఆన్!



- బండి షెడ్డులో ఉన్నా బిల్లు తీసేసుకుంటున్నారు
- మెకానికల్ విభాగంలో ఆయిల్ మాయ
- ప్రతీ నెలా రూ.లక్షన్నర మేర పక్కదారి
- అర్హత లేకపోయినా ఏఈ స్థాయిలో జీపు వినియోగం
- ఏడాది కాలంగా అడ్డగోలు వ్యవహారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మెకానికల్ విభాగంలో భారీ ఎత్తున ఆర్థిక అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కనీసం రోడ్లపై తిరగని వాహనం పేరుతో కూడా ప్రతీ నెలా ఆయిల్ బిల్లు డ్రా అవుతోంది. ఏఈ స్థాయి అధికారి ఏకంగా రెండు జీపుల్లో తిరుగుతున్నట్టు లెక్కలు చూపి ప్రతీ నెలా రూ. లక్ష మేర ఆయిల్ బిల్లును నొక్కేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన గత ఏడాది కాలంగా ఈ వ్యవహారం సాగుతోంది. ఇక జీవీఎంసీ నుంచి ఎస్‌ఈ స్థాయి అధికారి బదిలీపై వెళ్లి.. తిరిగి ఇక్కడకు వచ్చే వరకూ ఆయనే వాహనాన్ని నడుపుతున్నట్టు మరీ దోపిడీకి తెగబడుతున్నారు. ఇక ఫాగింగ్ మిషన్ల ఆయిల్ బిల్లు ఏకంగా ప్రతీ నెలా రూ. 30 లక్షల మేర అదనంగా పెంచేశారు. మొత్తంగా జీవీఎంసీ మెకానికల్ విభాగంలో మాత్రం వాహనంలో ముల్లు కదలక పోయినా ఆయిల్ బిల్లు మాత్రం లక్షలకు చేరుతోంది.

ఏడాది కాలంగా...!

జీవీఎంసీ మెకానికల్ విభాగంలో జరుగుతున్న ఈ అక్రమాలు విస్మయానికి గురిచేస్తున్నాయి. తిరుగుతున్న వాహనాలకు మాత్రమే కాకుండా, షెడ్లలో మూలకు చేరిన వాహనాలు నడుస్తున్నట్లు లెక్కలు చూపిస్తూ ఆయిల్ బిల్లులు కాజేస్తున్నారు. ఉదాహరణకు, పెద్దగా వాడకంలో లేని రెండు జీపులతో పాటు, అసలు పనిచేయకుండా నిలిచిపోయిన ఒక టాటా సఫారీ వాహనం పేరుతో ప్రతినెలా రూ. 1.5 లక్షల ఆయిల్ బిల్లులు డ్రా అవుతున్నాయి. ఈ విధంగా గత ఏడాది కాలంగా ఆయిల్ దోపిడీ జరుగుతోందని సమాచారం. అంటే, వాహనం ఆన్‌లో లేకపోయినా, జీవీఎంసీ మెకానికల్ విభాగంలోని కొందరు అధికారులు డీజిల్ బిల్లు మీటర్‌ను మాత్రం ఆన్‌లోనే ఉంచుతున్నారన్నమాట.

నిబంధనలకు విరుద్ధంగా..

నిబంధనల ప్రకారం జీవీఎంసీలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) స్థాయి అధికారికి ఎటువంటి వాహనం కేటాయించరు. కేవలం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈ) స్థాయి అధికారి నుంచే వాహనాలను కేటాయిస్తారు. అయినప్పటికీ ఏడాది కాలంగా మెకానికల్ విభాగంలోని ఒక ఏఈ ఏకంగా రెండు వాహనాలను ఉపయోగిస్తూ, ప్రతినెలా ఆయిల్ బిల్లుల రూపంలో లక్ష రూపాయల వరకూ కాజేస్తున్నారని విమర్శలున్నాయి.

బదిలీ అయిన తరువాత కూడా..

ఇంకో విచిత్రమైన సంఘటన ఏమిటంటే, ఒక **ఎస్‌ఈ స్థాయి అధికారి జీవీఎంసీలో పనిచేసి కాకినాడకు బదిలీపై వెళ్లిన తర్వాత ఆరు నెలల పాటు తిరిగి జీవీఎంసీకి వచ్చే వరకు ఆయన పేరు మీద ఉన్న వాహనాన్ని మాత్రం వెనక్కి తీసుకోలేదు. అంటే, ఆరు నెలల పాటు అక్కడ విధులు నిర్వర్తించని అధికారి పేరుతో వాహనాన్ని నడుపుతున్నారన్నమాట. మరో టాటా సఫారీ వాహనాన్ని కూడా ఇంకో అధికారి** వినియోగిస్తున్నారని, గత రెండు నెలలుగా ఆయిల్ బిల్లులను భారీగా డ్రా చేస్తున్నారని ఆరోపణలున్నాయి.

హైడ్రాలిక్ ఆయిల్, ఫాగింగ్ మిషన్ల పేరుతోనూ అక్రమాలు

హైడ్రాలిక్ ఆయిల్ కూపన్ల విధానాన్ని రద్దు చేసినప్పటికీ, ఒక్కో వాహనానికి 20 లీటర్ల చొప్పున కూపన్లను రోజువారీగా అదనంగా జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. హైడ్రాలిక్ ఆయిల్ లీటరు ధర రూ. 350 పైచిలుకు పలుకుతుంది. ఇక, ఫాగింగ్ మిషన్లు, స్ప్రింక్లర్లకు ఆయిల్ బిల్లులను అమాంతంగా రెట్టింపు చేయడంతో నెలకు రూ. 30 లక్షల మేర ప్రజాధనం పక్కదారి పడుతోంది. మొత్తంగా చూస్తే, జీవీఎంసీ మెకానికల్ విభాగంలో అవకాశం దొరికిన ప్రతిచోటా ఆయిల్ దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శలున్నాయి. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఫాగింగ్ మిషన్ల పేరుతో నెలకు రూ. 30 లక్షల అదనపు దోపిడీ

ఇక ఫాగింగ్ మిషన్ల పేరుతో నెలకు అదనంగా రూ. 30 లక్షల మేర ప్రజాధనం కాజేస్తున్నట్లు విమర్శలున్నాయి. జీవీఎంసీలో 8 పెద్ద ఫాగింగ్ మిషన్లు, 80 మీడియం సైజు ఫాగింగ్ మిషన్లు, 25 స్ప్రింక్లర్లు ఉన్నాయి. వీటికి గతంలో ప్రతినెలా రూ.38 లక్షల మేర ఆయిల్ బిల్లులు చెల్లించేవారు. అయితే, డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు అధికారులు మెకానికల్ విభాగంతో కుదుర్చుకున్న 'మామూళ్ల ఒప్పందంలో' భాగంగా ఈ బిల్లును ఏకంగా రూ. 68 లక్షలకు పెంచేశారు. ఈ అక్రమ ఒప్పందానికి ప్రతిఫలంగా, ప్రజారోగ్య విభాగంలోని ఒక అధికారికి, మలేరియా విభాగానికి చెందిన మరో అధికారికి చెరో రూ. 2 లక్షల చొప్పున ప్రతి నెలా ముట్టచెప్పే విధంగా ఒప్పందం కుదిరిందని ఆరోపణలున్నాయి. ప్రతినెలా ఈ 'మామూళ్ల పంపకంలో' మలేరియా విభాగంలోని ఒక అధికారిదే కీలక పాత్ర అని తెలుస్తోంది.

పూర్తిస్థాయి విచారణ

ఈ ఆరోపణలపై మెకానికల్ విభాగం ఈఈ రత్నాకర్ రెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా గత 10 రోజులుగా జీపులకు ఆయిల్ బిల్లులను నిలిపివేశామని తెలిపారు. అయితే ఈ ఆయిల్ కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారం జీవీఎంసీ పరిపాలనలో పారదర్శకత లేకపోవడాన్ని, అవినీతి ఏ స్థాయిలో పాతుకుపోయిందో స్పష్టం చేస్తోంది.

సూత్రధారులు ఓ ఏఈ... మలేరియా అధికారి....!

జీవీఎంసీలో జరుగుతున్న భారీ ఆయిల్ కుంభకోణంలో మరిన్ని షాకింగ్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఆయిల్ మాయాజాలంలో ప్రధానంగా ఒక అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) తో పాటు ప్రజారోగ్య విభాగంలోని ఒక అధికారి, మలేరియా విభాగంలోని ఒక అధికారికి కీలక పాత్ర ఉందని విమర్శలున్నాయి. తిరగని వాహనాలకు సైతం ఆయిల్ బిల్లులు దోచేస్తున్న జీవీఎంసీ మెకానికల్ విభాగం అధికారులు, కార్డుల ద్వారా మాత్రమే ఆయిల్ జారీ చేయాలనే నిబంధనను ఉల్లంఘిస్తున్నారని తెలుస్తోంది. అయితే హైడ్రాలిక్ ఆయిల్ కోసం మాత్రం 20 లీటర్ల కూపన్లను అదనంగా ఇస్తున్నట్లు సమాచారం. ఇది కేవలం కాగితాలపై మాత్రమే జరుగుతున్న వ్యవహారం అని, నిజానికి ఆయిల్ దారి మళ్లుతోందని ఆరోపణలున్నాయి.

విమాన ప్రమాద మృతులకు వైఎస్సార్ సీపీ ఘన నివాళి



కేకే రాజు ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

దాబాగార్డెన్స్: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రగాఢ సంతాపం తెలిపింది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి శుక్రవారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు నేతృత్వంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించి మృతులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఇలాంటి ఘటన ఎప్పుడూ జరగలేదని, ఇంతవరకు ప్రమాదానికి గల కారణాలు తెలియకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, గుజరాత్ ప్రభుత్వాలు ప్రకటించిన రూ.కోటి పరిహారం సరిపోదని, దీనిని మరింత పెంచి బాధితుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, గుజరాత్ ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. దాదాపు 241 మంది అకాల మరణం చెందారని, మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. విమాన ప్రమాదంలో ప్రయాణికులు మృతి చెందడంతో పాటు, ఆ విమానం మెడికల్ కాలేజీపై కూలి మెడికో విద్యార్థులు కూడా మృత్యువాత పడటం అత్యంత విచారకరమన్నారు. పార్టీ మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరగడం ఇదే మొదటిసారని, ఒకే కుటుంబానికి చెందిన 10 మంది చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, తిప్పల శ్రీనివాస్, దేవన్‌రెడ్డి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ శాసనసభ్యులు తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, నియోజకవర్గ విభాగాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'మురికివాడల' కేసు కొట్టివేత



న్యాయవాది చలం

దాబాగార్డెన్స్: దశాబ్దానికి పైగా సాగిన న్యాయపోరాటం ఫలించింది. 2012లో జీవీఎంసీ, పోలీస్ అధికారులు విశాఖలోని మురికివాడల ప్రజలపై నమోదు చేసిన కేసులను శుక్రవారం సెషన్స్ కోర్టు కొట్టివేసింది. అప్పట్లో 1200 మందిపై కేసులు నమోదు చేసి 94 మందిని అరెస్టు చేసి జైలుకి పంపారు. ఈ సుదీర్ఘ పోరాటంలో 8 మంది నిందితులు మరణించగా, పలువురు అనారోగ్యానికి గురయ్యారు. విశాఖ రైల్వే న్యూకాలనీలోని ఇందిరాగాంధీ కాలనీ, జ్ఞానాపురం బాబూ కాలనీ, దయానందనగర్ చాకలిగెడ్డ, రాజీవ్ కాలనీ, సెబాస్టియన్ కాలనీ, కంచరపాలెం మెట్టు పైడిమాంబ కాలనీ, మాధవధార ఏకలవ్య కాలనీ, సెంట్రల్ జైలు రామకృష్ణాపురం కాలనీ, పెందుర్తి చినముషిడివాడ అంబేడ్కర్ నగర్ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఫేకర్ లేఅవుట్, వినాయకనగర్ కాలనీ ప్రజలపై అక్రమంగా కేసులు బనాయించారు. 2వ జిల్లా, సెషన్స్ కోర్టు , 1వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు ఈ కేసులను కొట్టివేశాయి. ఈ కేసులో బాధిత ప్రజల తరఫున న్యాయవాదులు పల్లేటి అప్పారావు, కేఎస్ చలం, ఢిల్లీరావు, కె.పద్మ, ఎన్‌బీఎస్ చలపతి, ఎంఎస్ రాజు, యు.కనకరాజు వాదించారు. కోర్టు తీర్పు మురికివాడ ప్రజల పోరాటం న్యాయమైనదని నిరూపించిందని బాధితులు పేర్కొన్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, రాజకీయ నాయకులు మురికివాడ ప్రజల హక్కులను గుర్తించి, ఇందిరాగాంధీ కాలనీకి సంపూర్ణ హక్కులు కల్పించి గౌరవప్రదమైన జీవనం సాగించే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తల్లికి వందనం..వంచన

- నిబంధనల పేరుతో తల్లికి వందనం లబ్ధిదారుల సంఖ్య కుదింపు
- 2022–23లో ఇంటికొకరు చొప్పున 1,70,467 విద్యార్థులకు పంపిణీ
- ఇపుడు ఎంత మంది పిల్లలున్నా అందరికీ ఇస్తామని కూటమి హామీ
- కానీ జిల్లాలో 1,90,433 మందే అర్హులుగా తేల్చిన ప్రభుత్వం
- జిల్లాలో ఫస్ట్ నుంచి ఇంటర్ వరకు 4 లక్షల మంది విద్యార్థులు
- దరఖాస్తులు స్వీకరించకుండానే లబ్ధిదారుల ఎంపికపై అనుమానాలు
- రూ.12 వేలు కంటే ఎక్కువ జీతం వస్తే తల్లికి వందనం కట్
- ఎటువంటి ఆస్తులు లేకున్నా ఉన్నట్లు చూపిస్తూ అనర్హులుగా ప్రకటన



విశాఖ సిటీ: 'తల్లికి వందనం' అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు తల్లుల కు పంగనామాలు పెడుతోందనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి, తాజాగా నిబంధనల పేరుతో లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోత విధించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నెల 12వ తేదీ నుంచే డబ్బులు జమ అవుతాయని పత్రికా ప్రకటనలు రావడంతో బ్యాంకుల వద్ద పడిగాపులు కాసిన తల్లులు, డబ్బులు జమ కాకపోవడంతో చాలా మంది నిరాశగా వెనుదిరిగారు.

హామీల ఉల్లంఘన, నిబంధనల వల

ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం, ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. అయితే, 'ఫస్ట్ క్లాస్‌లో చేరిన వారికి వచ్చే ఏడాది నుంచి మాత్రమే ఇస్తాం' అంటూ ప్రభుత్వం మాట మార్చిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేల కంటే ఎక్కువ జీతం వచ్చిన వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగించారు. ఎటువంటి ఆస్తులు లేకపోయినా, ఉన్నట్లుగా చూపిస్తూ మరికొంతమందిని పథకం నుంచి తప్పించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

అనుమానాస్పద జాబితా ఎంపిక

ఏ పథకానికైనా దరఖాస్తులు స్వీకరించి, పరిశీలించి లబ్ధిదారులను గుర్తించడం తప్పనిసరి. కానీ ఈ ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించకుండానే లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించారు. గత విద్యా సంవత్సరం డేటా ఆధారంగా జాబితాను సిద్ధం చేయడం వల్ల, ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు పథకం వర్తించదని తల్లిదండ్రులకు సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.

ఆస్తుల లింకుతో ఇక్కట్లు

గతంలో 'అమ్మ ఒడి' తీసుకున్న లబ్ధిదారులు సైతం ఈ జాబితాలో అనర్హులుగా తేలడం గమనార్హం. దీనిపై సచివాలయంలో ఆరా తీయగా, వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ ఆస్తి ఉన్నట్లు లేదా రూ.12 వేలు కంటే ఎక్కువ ఆదాయం ఉన్నట్లు చూపుతూ అనర్హులుగా తేల్చినట్లు చెబుతున్నారు. వాస్తవానికి, అనర్హుల్లో అత్యధిక శాతం మందికి ఆస్తులు లేనప్పటికీ, ఉన్నట్లు చూపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఆస్తులు లేవని, అద్దె ఇంట్లో ఉన్నామని చెబుతున్నప్పటికీ, సచివాలయం సిబ్బంది తమకు సంబంధం లేదని జీవీఎంసీ కార్యాలయానికి వెళ్లాలంటూ తిప్పుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే, మ్యాపింగ్ చేపట్టినప్పుడు, అద్దెకున్న వారి ఆధార్ కార్డును ఇంటి ఆస్తి పన్నుతో లింక్ చేయడం వల్లే ఈ సమస్య తలెత్తిందని తెలుస్తోంది. దీంతో లబ్ధిదారుల ఆధార్ నెంబర్ పరిశీలిస్తే, ఆస్తి ఉన్నట్లు చూపిస్తోంది. ఈ లింకును తొలగించడానికి సచివాలయం సిబ్బంది నిరాకరించడం, ఉన్నతాధికారులు సైతం దీనిపై దృష్టి పెట్టకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లబ్ధిదారుల సంఖ్యలో భారీ కోత

ఎన్నికలకు ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ 'తల్లికి వందనం' కింద రూ.15 వేలు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది తర్వాత పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు హడావుడి చేశారు. దీని ప్రకారం జిల్లాలో 3 నుంచి 3.5 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని అందరూ భావించారు. కానీ జిల్లాలో మొత్తం 4 లక్షల మంది విద్యార్థులు ఉండగా, కేవలం 1,30,706 మంది తల్లులకు గాను 1,90,433 మంది పిల్లలకు మాత్రమే ఇస్తున్నట్లు ప్రకటించారు. 2022–23లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 'అమ్మ ఒడి' పథకాన్ని 1,70,467 మందికి అమలు చేసింది. ఎన్నికల కారణంగా 2024లో నిధులు పడలేదు. రెండేళ్ల తర్వాత అమలు చేస్తున్న పథకంలో లబ్ధిదారుల సంఖ్య 3 లక్షలకు పెరుగుతుందనుకుంటే, కేవలం 19,966 మందికి మాత్రమే అదనంగా ఇస్తున్నట్లు తెలుస్తోంది.

16న జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 16న నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయీ సంఘం చైర్మన్ పీలా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 286 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటిలో మినిస్టీరియల్ సిబ్బంది సర్వీస్ అంశాలతో పాటు పలు రెవెన్యూ, అభివృద్ధి సంబంధిత అంశాలున్నాయి. ముఖ్యంగా, భూపేష్‌నగర్ నైట్ షెల్టర్ కాలపరిమితి పునరుద్ధరణ, జోన్–1 తగరపువలస, చిట్టివలస రోడ్డు మార్జిన్ మార్కెట్ ఆశీలు వసూలు లీజుకు ఇవ్వడం, లాల్ బహదూర్ శాస్త్రి మార్కెట్, చిన్న బజార్ కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు మార్కెట్ల రోజువారీ ఆశీలు, ముడసర్లోవ పార్క్ క్యాంటీన్ నిర్వహణ కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు సంబంధించిన అంశాలు చర్చకు రానున్నాయి. అలాగే జీవీఎంసీ పరిధిలోని అన్ని జోనల్ కార్యాలయాల్లోని వాణిజ్య సముదాయాల కాంట్రాక్టు పొడిగింపు, పలు వార్డుల్లో వరద నీటి కాలువలు, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు కూడా ఆమోదానికి రానున్నాయి.

ఏయూ మోడల్ కెరీర్ సెంటర్‌లో 18న జాబ్ మేళా

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 18వ తేదీ ఉదయం 10:30 గంటల నుంచి పలు కంపెనీల ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మోడల్ సెంటర్ డైరెక్టర్ కె. దొరబాబు తెలిపారు. ఈ జాబ్ మేళాలో యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ లైఫ్, ఆప్టిమల్ హెల్త్ సొల్యూషన్స్, హెల్త్‌కేర్, ఐఫోన్ కంపెనీ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మరింత సమాచారం కోసం https:// employment.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

జీవీఎంసీ డీడీవోగా ఫణిరామ్ బాధ్యతల స్వీకరణ


డీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఫణిరామ్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ డీడీవోగా ఎం.వి.డి.ఫణిరామ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ వ్యక్తిగత కారణాలతో ఈ నెల 24 వరకు సెలవులో ఉండటంతో, ఆయన నిర్వహిస్తున్న డీడీవో బాధ్యతలను జీవీఎంసీ డీపీఓగా విధులు నిర్వహిస్తున్న ఎం.వి.డి.ఫణిరామ్‌కు పూర్తి అదనపు బాధ్యతలతో అప్పగిస్తూ జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ హరేందిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జీవీఎంసీ అదనపు కమిషనర్ (ఫైనాన్స్) బాధ్యతలను జీవీఎంసీ అదనపు కమిషనర్ (జనరల్) డి.వి. రమణమూర్తికి అప్పగించినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

జంట కనిపిస్తే వారికి కాసుల పంటే..!

కాస్త పొద్దుపోయాక నిర్మానుష్య రోడ్డులో బైక్‌పై ఆడామగా కనిపిస్తే చాలు.. ఈ నకిలీ పోలీసుల పంట పండినట్లే. పోలీస్ యూనిఫారంలు వేసుకుని బైక్‌లను అడ్డగించి, వారిని బెదిరించి, దోపిడీకి పాల్పడ్డమే వీరి దినచర్య. డబ్బులు ఇవ్వకపోతే కేసులు కట్టి పరువు తీస్తామంటారు. తప్పనిసరి పరిస్థితిలో కొందరు వారికి డబ్బులు ఇచ్చేస్తున్నారు. ఓ యువకుడు తెగించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నకిలీ పోలీసుల దోపిడీకి అడ్డుకట్ట పడింది.

- దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు నకిలీ పోలీసుల అరెస్ట్
- అడవివరం–శొంఠ్యాం రోడ్డులో కాపుకాసి బలవంతంగా వసూళ్లు
- బాధితుడి ఫిర్యాదుతో చాకచక్యంగా పట్టుకున్న పెందుర్తి పోలీసులు
- నిందితుల్లో ఒకరు తొలగించబడ్డ పోలీస్ కానిస్టేబుల్


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సతీష్‌కుమార్, చిత్రంలో ఏఎస్ఐ కాళీ ప్రసాద్


నిందితులు శివప్రసాద్, కందారపు గోపి

పెందుర్తి: అడవివరం–శొంఠ్యాం రోడ్డులో ప్రేమ జంటలే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు నకిలీ పోలీసులను పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ కె.వి.సతీష్‌కుమార్ వెల్లడించారు.

విజయనగరం జిల్లా ధర్మవరం మండలం మామిడిపాలేనికి చెందిన ఏతలపాక శివప్రసాద్, నగరంలోని రైల్వే న్యూకాలనీలో నివాసం ఉంటున్న కదరాపు గోపీతో కలిసి దారి దోపిడిలు చేయడం వృత్తిగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో పోలీస్ కానిస్టేబుల్ యూనిఫాంలు ధరించి అడవివరం–శొంఠ్యాం రోడ్డులో ఈ నెల 3 నుంచి 6 వరకు మాటు వేశారు. రోజూ పొద్దుపోయాక అటుగా వెళ్తున్న ప్రేమ జంటలను గమనించేవారు. వారు ఎక్కడైనా బైక్‌లు నిలిపి మాట్లాడుకోవడం, లేదా అనుమానం కలిగేలా ప్రవర్తించడం చూసి వారి వద్దకు వెళ్లి, బెదిరింపులకు దిగేవారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6న కోరాడ జయరాం అనే వ్యక్తి గాజువాక నుంచి బైక్‌పై తనకు కాబోయే భార్యతో కలిసి విజయనగరం వెళ్తున్నాడు. సరిగ్గా అడవివరం భైరవకోన దాటాక వారిని అడ్డగించిన శివప్రసాద్, గోపి తాము పోలీసులమని చెప్పి బెదిరింపులకు దిగారు. నగదు ఇస్తే వదిలేస్తామని, లేదంటే కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామని భయపెట్టారు. అయితే నగదు లేదని, ఫోన్‌పే ద్వారా ఇస్తానని చెప్పడంతో నిందితుడు శివప్రసాద్ తన వద్ద ఉన్న ఫోన్‌పే క్యూఆర్ కోడ్ ద్వారా రూ.5 వేలు నగదు బదిలీ చేయించుకున్నాడు. వీరి తీరుపై అనుమానం వచ్చిన జయరాం అదే రోజు రాత్రి విశాఖ సీపీకి వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశాడు.

పది జంటల నుంచి వసూళ్లు

ఈ నెల 3 నుంచి 6 వరకు దాదాపు పది జంటల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి రూ.2 వేలు నగదు, స్కూటీ, రెండు సెల్‌ఫోన్లతో పాటు రెండు పోలీస్ యూనిఫాంలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు శివప్రసాద్ గతంలో ఏపీఎస్‌పీ 5వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసేవాడని, అతడి అనుచిత ప్రవర్తన కారణంగా 2019లో ఉద్యోగం నుంచి తొలగించినట్లు సీఐ తెలిపారు. శివప్రసాద్‌పై దోపిడి, దొంగతనం కేసులు 15 ఉండగా, అందులో 9 దోపిడీ కేసులు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లోనే ఉన్నాయన్నారు. నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ స్వామినాయుడు, హెచ్‌సీ గెదెల అప్పారావు, పీసీలు రొంగలి సంతోష్‌కుమార్, ప్రగడ గణేశ్వరరావు, గాదె శంకర్రావులను ఉన్నతాధికారులు అభినందించారు.

నిందితుడు పాత నేరస్తుడే..

ఈ క్రమంలో సీపీ శంఖబ్రతబాగ్చీ ఆదేశాల మేరకు వెస్ట్ జోన్ ఏసీపీ ఏబీ పృథ్వితేజ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ బృందం నిందితుల కోసం అన్ని కోణాల్లో గాలించారు. బాధితుడి ఫోన్‌పే ట్రాన్సాక్షన్ ఆధారంగా నిందితుల ఫోన్‌పే ఖతాపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో గురువారం రాత్రి 8 గంటల సమయంలో ఇదే తరహాలో దోపిడీకి పాల్పడేందుకు పోలీస్ యూనిఫాంలో పెందుర్తి మండలం సరిపల్లి చెక్‌పోస్టు వద్ద మాటు వేసిన శివప్రసాద్, గోపిలను పట్టుకున్నట్లు సీఐ వెల్లడించారు.

‘యోగాంధ్ర’లో అధికారిణుల సిగపట్లు!

- ఆయుష్ ఇన్‌చార్జ్ ఆర్‌డీ ఝాన్సీ, డీఎస్‌డీఏ జాన్‌గాలియట్ మధ్య ఆధిపత్య పోరు
- యోగా శిక్షకుల ఎంపికలో వివాదం

మహారాణిపేట: ఇద్దరు మహిళా అధికారిణుల ఆధిపత్య పోరు సిగపట్లు స్థాయికి చేరి జిల్లా అధికార యంత్రాంగంలో కలకలం రేపింది. పదుగురూ చూస్తుండగానే పరస్పరం దుర్భాషలాడుకుంటూ, ఒకరిని ఒకరు నెట్టుకుని రచ్చకెక్కారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శిక్షకుల ఎంపికలో తలెత్తిన విభేదాలే ఈ గొడవకు దారితీసినట్లు సిబ్బంది చెప్పుకుంటున్నారు.

ఈ నెల 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ ముస్తాబవుతున్న విషయం తెలిసిందే. 5 లక్షల మందితో యోగాసనాలు వేయించి గిన్నీస్ బుక్‌లో స్థానం కోసం జిల్లా యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తోంది. ఇందులో భాగంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గురువారం రాత్రి యోగా ట్రైనర్స్ ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఈ సందర్భంలో ఆయుష్ ఇన్‌చార్జ్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి, జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారిణి(డీఎస్‌డీవో) జాన్ గాలియట్ మధ్య లిస్టుల కోసం మాటామాటా పెరిగింది. యోగా కార్యక్రమానికి దాదాపు రెండు వేల మంది ట్రైనర్స్‌ను ఎంపిక చేసే బాధ్యతను ఝాన్సీకి అప్పగించారు. ఈ ఎంపిక కాస్త నెమ్మదిగా జరుగుతుండడంతో డీఎస్‌డీవోను కూడా బాధ్యురాల్ని చేసి, ఎంపిక ప్రక్రియ వేగంగా జరిగేలా చూడాలని జిల్లా అధికారులు ఆదేశించారు. మొత్తం తననే చూడమంటే.. మధ్యలో మీరేం చేస్తారన్నట్టుగా ఆయుష్ ఆర్‌డీ మాట్లాడడంతో వివాదం చెలరేగింది. వెంటనే డీఎస్‌డీవో స్పందించి జిల్లా కలెక్టర్ తనకు కూడా బాధ్యతలు అప్పగించారనడంతో మాటలు పెరిగి, వాగ్వాదం నెలకొంది.

ఆయుష్ ఆర్‌డీ చేతిలో ఉన్న ఫైల్‌ను డీఎస్‌డీవో లాక్కోవడంతో వివాదం మరింత ముదిరింది. ఇరువురూ ఒకరిపై ఒకరు ఇష్టారీతిన నోరుపారేసుకున్నారు. స్థాయిని మరచి మరీ అరుస్తూ, సిగపట్లు పట్టడంతో అక్కడున్న వారు నిశ్చేష్టులయ్యారు. అయితే సిగపట్లేమీ లేవని, కేవలం వాగ్వాదమే జరిగిందని అధికారులు వివరణ ఇస్తున్నారు. జరిగిన విషయాన్ని నేరుగా కలెక్టర్‌కు డీఎస్‌డీవో వాట్సాప్‌లో పంపినట్టు తెలిసింది. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి మరి.

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

మహారాణిపేట: ఈనెల 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ జాతీయ ఆతిథ్య నగరంగా ఎంపిక కావడంతో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సీనియర్ అధికారులు సంయుక్తంగా నగరంలో క్షేత్రస్థాయి పరిశీలన, సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ రాజేష్ కోటెచా, ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు నేతృత్వంలో అధికారులు రుషికొండ బీచ్, ఆర్కే బీచ్, ఆంధ్ర యూనివర్సిటీ, గీతం విశ్వవిద్యాలయం వంటి ప్రధాన వేదికలను సందర్శించారు. ఈ పర్యటనలో ఆయుష్ జాయింట్ సెక్రటరీ మోనాలిసా దాష్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్‌తో పాటు ఆరోగ్య, పట్టణ ప్రణాళిక, వీఎంఆర్‌డీఏ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ‘యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్’ నినాదంతో భారతదేశం సమగ్ర ఆరోగ్యం దిశగా పయనిస్తుండగా, విశాఖపట్నం ఈ ప్రపంచ ఉద్యమానికి వేదికగా మారడానికి సిద్ధమవుతోంది. రాష్ట్ర నోడల్ అధికారి ఎం.టి. కృష్ణబాబు ఏయూ కన్వెన్షన్ హాలు సమీపంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి, యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



కూటమి ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- డబుల్ ఇంజిన్ సర్కార్‌లో విశాఖ ప్రజలపై భారాలు
- మీడియాతో సీపీఎం విశాఖ జిల్లా కమిటీ


సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆక్షేపించారు. జగదాంబ సమీపానున్న పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావులతో కలిసి శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు విశాఖ ప్రజలకు ఇచ్చిన హామీలకు భిన్నమైన పాలన సాగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో ప్రజలపై భారాలు పెరిగాయి తప్ప, ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ధ్వజమెత్తారు. తొలుత అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును, కార్మికులను కాపాడతామని ఎన్నికల ముందు మభ్యపెట్టి, ఇప్పుడు కేంద్రం చెప్పుచేతల్లో నడుస్తూ ప్లాంట్ ప్రైవేటీకరణకు అండగా నిలుస్తున్నారని ఎద్దేవా చేశారు. రూ.11,440 కోట్లు ప్యాకేజీలో ఒక్క రూపాయి కూడా ప్లాంట్‌కు ఖర్చు చేయనివ్వలేదని ఆరోపించారు. విశాఖ రైల్వే జోన్ ప్రతిపాదించి 11 నెలలైనా ఇంత వరకు కేంద్రం నుంచి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయించలేకపోయారని ఆక్షేపించారు. జమ్మూ రైల్వే డివిజన్ ఏర్పాటును 2025 జనవరిలో ప్రకటిస్తే 6 మాసాల్లోపే డీపీఆర్ ఆమోదంతో పాటు గెజిట్ నోటిఫికేషన్‌కూడా వచ్చిందన్నారు. అధికారంలోకి వస్తే విలువ ఆధారిత ఆస్తిపన్ను రద్దు చేస్తామని చెప్పి, ఇప్పుడు 15 శాతం పన్ను పెంచేయడం దారుణమన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లపై టీడీపీ ద్వంద్వ వైఖరిని విమర్శించారు. ఇళ్లులేని పేదలకు టిడ్కో ఇల్లు, 2 సెంట్ల భూమి హామీ అతీగతిలేదన్నారు. సూపర్ సిక్స్ పేరిట ప్రజలను మభ్యపెట్టడం సరికాదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, నెలకు రూ.1500 ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి ఇతర హామీలు వాయిదాలు వేస్తున్నారని, గత ప్రభుత్వం ఇచ్చిన పథకాలు నిలిపివేయడం దారుణమన్నారు.

‘హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అపోహలు వద్దు’


సదస్సులో పాల్గొన్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఇతర వైద్యులు

ఏయూక్యాంపస్: హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై ప్రజలు అపోహలు వీడాలని వైద్యులు సూచించారు. బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో సీరం ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో కాంకర్ హెచ్‌పీవీ–క్యాన్సర్ కాన్‌క్లేవ్‌ను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి శుక్రవారం ప్రారంభించి, మాట్లాడారు. మహిళల్లో రొమ్ముక్యాన్సర్ తర్వాత అత్యధికంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కనిపిస్తోందన్నారు. వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా దీనిని నివారించడం సాధ్యపడుతుందన్నారు. అపోహలు వీడి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆంధ్ర మెడికల్ కళాశాల ఆచార్యులు డాక్టర్ విద్య రమ మాట్లాడుతూ స్త్రీ, పురుషులకు వచ్చే అనేక క్యాన్సర్‌లను హెచ్‌పీవీ వ్యాక్సిన్ నిరోధిస్తుందన్నారు. 9 నుంచి 15 ఏళ్ల వయసు వారికి రెండు డోసులు, ఆపైబడిన వయసు వారు మూడు డోసులు వేసుకోవాలన్నారు. ఒక్కో డోసుకు మధ్య ఐదు నెలల వ్యత్యాసం ఉండాలన్నారు. 26 ఏళ్లలోపు వయసున్నవారు దీనిని తీసుకోవాలన్నారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌కు ఇతర క్యాన్సర్లను నిరోధించే శక్తి కూడా ఉందన్నారు. కార్యక్రమంలో స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ సునందరాణి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మురళీసంతోష్, డాక్టర్ సాయి సునీల్ కిషోర్ తదితరులు మాట్లాడారు.

రక్తదానంతో ఆరోగ్యం


ర్యాలీని ప్రారంభిస్తున్న విమ్స్ డైరెక్టర్ రాంబాబు

ఆరిలోవ: రక్తదానం చేసినవారికి ఆరోగ్యంతో పాటు, మానసిక ఆనందం కలుగుతుందని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని శుక్రవారం విమ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విమ్స్ సిబ్బంది చేపట్టిన రక్తదాన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సిబ్బంది ప్లకార్డులతో నినాదాలు చేస్తూ విమ్స్ పరిపాలనా విభాగం నుంచి జాతీయరహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు రక్తదానం చేయడం ఆరోగ్యానికి మంచిదన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నవారవుతారని పేర్కొన్నారు. విమ్స్‌లో ఆరు నెలల నుంచి రక్తనిధి అందుబాటులో ఉందన్నారు. ఇంతవరకు 8 రక్తదాన శిబిరాలు నిర్వహించి వాటి ద్వారా 542 యూనిట్ల రక్తం సేకరించినట్లు వెల్లడించారు. రక్త హీనత, తలసేమియా రోగులకు త్వరలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో విమ్స్ వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పునీత ఆంథోనీ చర్చి పండగ

దాబాగార్డెన్స్: నగరం నడిబొడ్డున వందేళ్ల చరిత్ర గల పునీత ఆంథోనీ దేవాలయంలో శుక్రవారం పెద్ద ఎత్తున చర్చి(గుడి పండగ) పండగ నిర్వహించారు. గత నెల 31 నుంచి నవదిన ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఈ పండగకు విశాఖ నుంచే కాక కోస్తాంధ్ర జిల్లాల నుంచి భక్తులు ఆశేషంగా తరలివచ్చారు. పునీత ఆంథోనీ జీవిత విశేషాలను స్మరించుకున్నారు. హాజరైన గురువులు వివిధ అంశాలపై ప్రసంగించారు. సాయంత్రం విశాఖ అగ్ర పీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాల, సెయింట్ ఆంథోనీ చర్చి విచారణ గురువు డి.బాలశౌరి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం 4 నుంచి 6 వరకు తిరువీధి ప్రదక్షిణ, దివ్యపూజ బలితో వేడుకలు ముగిశాయి. తిరువీధి ప్రదక్షిణ చర్చి వద్ద ప్రారంభమై దిబ్బలపాలెం, జగదాంబ జంక్షన్, దండుబజార్, భుజంగరావుపేట, రామజోగిపేట, ఆంథోనీనగర్, సెయింట్ ఆంథోనీ హైస్కూల్(గుడి చుట్టూ) మీదుగా పునీత ఆంథోనీ దేవాలయం వరకు సాగింది. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

యోగాంధ్రలో పాల్గొనేందుకు క్యూఆర్ కోడ్ సౌకర్యం


క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి వివరిస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి

దాబాగార్డెన్స్: ఈ నెల 21న రామకృష్ణా బీచ్ నుంచి భీమిలి వరకు నిర్వహించనున్న ‘యోగాంధ్ర’ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఏపీఎస్‌ఆర్‌టీసీ ద్వారా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించారు. ద్వారకాబస్‌స్టేషన్‌లోని ఏపీఎస్‌ఆర్‌టీసీ కార్యాలయంలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ద్వారకాబస్‌స్టేషన్ యూనిట్ ఇన్‌చార్జ్ పీబీఎంకే రాజు, వర్మ, హరిశంకర్‌తో పాటు పలువురు సూపర్‌వైజర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

నేడు, రేపు హై లైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించే ఆభరణాలతో మోడళ్లు

ఏయూ క్యాంపస్: వివాహాలకు అవసరమైన విభిన్న మోడళ్ల ఆభరణాలతో కూడిన రెండు రోజుల హై లైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్ శని, ఆదివారాలు నోవాటెల్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో భాగంగా వివాహ సందర్భాల్లో వధువును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే ఆభరణాలు అందుబాటులో ఉంటాయన్నారు. డిజైనర్‌ల చేతిలో రూపుదిద్దుకున్న ఫ్యాషన్ ఆభరణాలు మహిళల అందాన్ని మరింత ద్విగుణీకృతం చేస్తాయన్నారు. భారత దేశవ్యాప్తంగా పేరుగాంచిన డిజైనర్లు తాము తయారు చేసిన ఆభరణాలను ఇక్కడ ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. వివాహ ఫ్యాషన్‌కు తగినట్టుగా ప్రతి ఆభరణం ఎంతో నైపుణ్యంతో డిజైన్ చేసి, తయారు చేసి విశాఖ వాసుల కోసం ఇక్కడి ప్రదర్శనలో ఉంచుతున్నట్లు వెల్లడించారు.

ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్‌ఎంఈలు కీలకం

విశాఖ సిటీ: దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్‌ఎంఈలు కీలకమని చెన్నై జోనల్ యూనిట్ డీజీటీఎస్ ప్రిన్సిపల్ ఏడీజీ నీరజ్‌కుమార్ మల్లిక్ పేర్కొన్నారు. విశాఖపట్నం సీజీఎస్టీ కమిషనరేట్, డీజీటీపీఎస్ చెన్నై జోనల్ యూనిట్ సహకారంతో ఎంఎస్‌ఎంఈ రంగంలోని పన్ను చెల్లింపుదారులు, మహిళా పారిశ్రామిక వేత్తల కోసం జీఎస్టీ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని శుక్రవారం డాల్ఫిన్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చుకోడానికి ‘మేక్ ఇన్ ఇండియా’దోహదం చేస్తుందన్నారు. భారత్–పాక్ వివాదంలో మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తుల పాత్రను వివరించారు. విశాఖ సీజీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ దేశ పరోక్ష పన్నుల వ్యవస్థలో జీఎస్టీ కొత్త సంస్కరణలు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. అనంతరం ఎంఎస్‌ఎంఈ రంగాన్ని ప్రోత్సహించడానికి, వారి పరోక్ష పన్నును సులభతరం చేసేందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్, ఆర్థిక మంత్రిత్వ శాఖ తీసుకున్న చర్యలను వివరించారు. ఎంఎస్‌ఎంఈ రంగానికి చెందిన 100 మందికిపైగా పారిశ్రామికవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. పారిశ్రామికవేత్తలు, వాణిజ్య సంఘాల ప్రతినిధుల ప్రశ్నలకు నాసిన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శ్రీవాత్సన్ సమాధానమిచ్చారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

విశాఖ సిటీ: సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్(సెమ్స్), ఎల్ అండ్ టీ సహకారంతో నిరుద్యోగ యువతీ, యువకులకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్‌తో ఉపాధి కల్పిస్తామని సెమ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ పరిధిలో 22 ఏళ్లలోపు ఉన్న ఐటీఐలో ఫిట్టర్, టర్నర్, మిషనిస్ట్, వెల్డర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్‌తో పాటు డిప్లమో మెకానికల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రీషియన్, మిషనిస్ట్, పైప్‌ఫిట్టర్, వెల్డర్, ఆటోక్యాడ్ కోర్సుల్లో 45 రోజుల ఉచిత శిక్షణ ఉంటుందని వెల్లడించారు. అనంతరం ఉపాధి సహకారంతో పాటు స్టైఫండ్ ఉంటుందని వివరించారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు కోసం 9948183865, 0891-2704010, 8331019173 నెంబర్లకు సంప్రదించి ఈ నెల 20వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

‘జలవనరుల శాఖ బదిలీల్లో అక్రమాలు లేవు’

మహారాణిపేట: జలవనరుల శాఖలో ఉద్యోగుల బదిలీల్లో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోలేదని, అన్ని నిబంధనల ప్రకారమే బదిలీలు నిర్వహించామని ఆ శాఖ ఎస్‌ఈ స్వర్ణకుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నియమావళికి లోబడే అన్ని బదిలీలు జరిగాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణకుమార్ మాట్లాడుతూ, ‘పోస్టు ఖాళీ ఉంటేనే బదిలీ చేయగలం. పోస్టు లేకుండా ఉద్యోగులకు పోస్టు ఇవ్వలేం. అయితే, ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు ఒకే చోట సీటు కావాలని పట్టుబడటం జరిగింది’ అని వివరించారు. బదిలీల్లో ఎవరికీ అన్యాయం జరగలేదని ఎస్‌ఈ పేర్కొన్నారు.

మత్స్య వేటకు సై!



రెండు మాసాల మత్స్య వేట నిషేధ గడువు ముగింపునకు చేరుకుంది. నేటి అర్ధరాత్రి నుంచి చేపల వేట ప్రారంభం కానుంది. ఇప్పటికే బోట్లు, వలల మరమ్మతులు చేపట్టి, లంగరెత్తేందుకు గంగపుత్రులు సిద్ధమయ్యారు. ఈ రోజు రాత్రి నుంచే వేటకు వెళ్లనుండటంతో ఫిషింగ్ హార్బర్‌లో సందడి నెలకొంది. తమకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేసుకుంటూ మత్స్యకారులు హడావుడిగా ఉన్నారు. బాక్స్‌ల నిండుగా ఐస్ లోడ్ చేశారు. పక్షం నుంచి నెల రోజులకు సరిపడా వంట సామగ్రి బోటులో చేర్చారు. చిన్నచిన్న లోపాలు కూడా లేకుండా అంతా మరోసారి చెక్ చేసుకున్నారు.




– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం